క్లుప్తంగా

భూసార పరీక్షలతో ఎన్నో ప్రయోజనాలు



నందిగామ: భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని జిల్లా వనరుల కేంద్రం విజయవాడకు చెందిన సహాయ వ్యవసాయ సంచాలకులు మోనిషా సూచించారు. పొలం సందర్శనలో భాగంగా మండలంలోని పల్లగిరి గ్రామంలో ఆమె బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా పొలంలో మట్టి నమూనా తీసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం మోనిషా మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు భూసార పరీక్షలు చేయించుకోవడం వలన పొలంలో ఉన్న సారాన్ని తెలుసుకోవచ్చన్నారు. తద్వారా భూమికి ఏ ఎరువులు అవసరమో వాటిని మాత్రమే అందించొచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా పచ్చి రొట్ట ఎరువుల వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. స్థానిక వ్యవసాయ అధికారి ఖాసిం, సర్పంచ్ చాగంటి రవికిరణ్ రెడ్డి, పలువురు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వేను పక్కాగా నిర్వహించాలి

వీరులపాడు: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు- భూ రక్ష పథకంలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వేను సంబంధిత సిబ్బంది పక్కాగా నిర్వహించాలని తహసీల్దార్ ఆశయ్య నాయక్ సూచించారు. మండలంలోని పెద్దాపురం, జయంతి, గూడెంమాధవరం గ్రామాల్లో జరుగుతున్న భూముల రీ సర్వేను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బంది కలిగించకుండా సర్వే నిర్వహించాలని సూచించారు. రైతులు ఏవైనా అభ్యతరాలను తెలిపితే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. సర్వేను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యంలో కలేకూరిది విభిన్న శైలి

కంచికచర్ల(వీరులపాడు): కవిత్వం, వ్యాసం, అనువాదంతో పాటు తెలుగు సాహిత్యంలో కవి, రచయిత, ఉద్యమకారుడు కలేకూరి ప్రసాద్ శైలి విభిన్నంగా ఉంటుందని రచయిత తంగిరాల సోనీ పేర్కొన్నారు. కంచికచర్లలో బుధవారం కలేకూరి 10వ వర్ధంతిని నిర్వహించారు. ముందుగా కలేకూరి చిత్రపటానికి పలువురు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా తంగిరాల సోనీ మాట్లాడుతూ.. ముఖ్యంగా కలేకూరి లేని లోటును ఎవరూ పూడ్చలేరని చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకుడు వేల్పుల రమేష్, ఎస్సీ నాయకుడు కర్ల రవికుమార్, సీఐటీయూ నాయకులు బెజ్జం భూషణం, పుల్లయ్య, పిల్లి స్వామిదాసు, చట్టి రవీంద్ర, కోదాటి మన్మధరావు, బురగ వర్మ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న భానుడి ప్రతాపం

నందిగామ: కొద్ది రోజులుగా భానుడి ప్రతాపం కొనసాగుతోంది. నందిగామ ప్రాంతంలో నాలుగు రోజులుగా ఎండలు మండుతున్నాయి. ఎండలు, వడగాడ్పుల ధాటికి ప్రజలు విలవిల్లాడుతున్నారు. బుధవారం కూడా నందిగామలో 42.6 డిగ్రీల గరిష్ట, 29.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెల్లవారుతూనే భానుడు విరుచుకుపడుతున్నాడు. ఎండలకు వడగాడ్పులు తోడవడంతో ఇంటి నుంచి బయటకు రావాలంటనే ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నందిగామ: పట్టణంలోని పలు ప్రాంతాల్లో గురువారం నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని ఏఈ దిబ్బయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో పట్టణంలోని రామన్నపేట రోడ్డు, బీసీ కాలనీ, జానకి రామయ్య కాలనీ, చిన్న మసీదు రోడ్డు, నెహ్రూ నగర్, చెరువు బజార్, టీబీ రోడ్డు, కాకులయ్య బజార్ తదితర ప్రాంతాలలో ఉదయం ఏడు నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

20న వాహనాల వేలం

జగ్గయ్యపేట అర్బన్: ప్రొహిబిషన్, ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన 12 వాహనాలకు ఈ నెల 20వ తేదీన తమ స్టేషన్ ప్రాంగణంలో వేలం నిర్వహిస్తామని స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ జి.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. 11 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోకు వేలం వేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఆటోకు రూ.5 వేలు, ద్విచక్ర వాహనానికి రూ.3 వేల చొప్పున ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94409 02461, 95022 58678 సెల్ నంబర్లలో సంప్రదించాలని సెబ్ సీఐ జి.శ్రీనివాసరావు కోరారు.

ఎర్ర బంగారానికి మార్కెట్‌లో గిరాకీ

- మిర్చి క్వింటా ధర రూ.22 వేలకు పైనే..
- ఎకరానికి నగటున 10 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి
- గిట్టుబాటు ధర రావడంతో రైతుల్లో వ్యక్తమవుతున్న సంతోషం



కంచికచర్ల మండలం కీసరలో రైతులు సాగుచేసిన కల్లాల్లో ఆరబోసిన మిర్చి

కంచికచర్ల: ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉండటంతో మిర్చి సాగుచేసిన రైతులు సంతోషంగా ఉన్నారు. ప్రస్తుతం ఎండు మిర్చికి మంచి ధర పలుకుతోంది. మార్కెట్‌లో క్వింటా ధర రూ.22 వేలకు పైగా ఉందని రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. నిన్న మొన్నటి వరకు రూ.18 వేలకు పలికిన ధర ఈ రెండు రోజుల్లో మరో రూ.4 వేల వరకు పెరిగింది. ప్రస్తుతం మూడు, నాలుగు కోతల కాయలను కిలో రూ.250 చొప్పున రైతులు గ్రామాల్లోనే విక్రయించారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో ఎండు మిర్చి సీజన్ మొదలవుతుంది. కంచికచర్ల మండలం మోగులూరు, గనిఆత్కూరు, కీసర తదితర గ్రామాలకు వినియోగదారులు నేరుగా వచ్చి ఎండు మిరప కాయలను కొనుగోలు చేస్తుంటారు. ఈ గ్రామాల్లో పండించిన మిర్చి దేశవాళీ కావటంతో నాణ్యత, రుచి ఉంటుందని ప్రజల నమ్మకం. ఈ గ్రామాల్లో సాగు చేసిన మిరపకాయలతో తయారు చేసిన కారంతో పచ్చళ్లు పెడితే ఎక్కువ రోజులు నిల్వ ఉంటుందని మహిళలు అంటున్నారు. ఈ ప్రాంత వాసులు కూడా స్థానికంగా లభించే మిర్చిని కొనుగోలు చేసి దూర ప్రాంతాల్లోని బంధువులకు వేసవి కానుకగా పంపిస్తారు.

5,265 ఎకరాల్లో సాగు

నందిగామ నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో రైతులు 5,265 ఎకరాల్లో మిర్చి పంటను సాగుచేశారని నందిగామ వ్యవసాయ సంచాలకులు ధర్మపురి రమణమూర్తి తెలిపారు. కంచికచర్ల మండలంలో 431 ఎకరాలు, నందిగామ మండలంలో 1,025 ఎకరాలు, చందర్లపాడు మండలంలో 3,110 ఎకరాలు, వీరులపాడు మండలంలో 699 ఎకరాల్లో రైతులు మిర్చి సాగుచేశారు. మిర్చి పంటను ఎక్కువగా చందర్లపాడు మండలం రైతులు సాగు చేస్తారు. మండలంలోని గ్రామాలన్నీ కృష్ణా నదిని ఆనుకుని ఉండటంతోపాటు నీటి వనరుల లభ్యత బాగా ఉంటుంది.

ఆశాజనకంగా దిగుబడులు

రైతులు మంచి నాణ్యమైన విత్తనాలు నాటితే వారు ఆశించిన మేరకు ఎకరాకు 15 నుంచి 25 క్వింటాల వరకు దిగుబడి వస్తుంది. చందర్లపాడు మండలంలో 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చిందని రైతులు తెలిపారు. చీడపీడలు ఆశించిన చోట 10 నుంచి 15 క్వింటాళ్ల లోపు దిగుబడి వచ్చిందని పేర్కొన్నారు. ఎకరాకు మిర్చి పంట సాగుకు రూ.70 వేల రూ.90 వేల వరకు పెట్టుబడి ఖర్చులు అయ్యాయని రైతులు పేర్కొన్నారు.

ధర ఆశాజనకం



ఈ ఏడాది మిర్చి పంటకు మార్కెట్‌లో మంచి ధర లభిస్తోంది. రైతులు ఆశించిన మేరకు దిగుబడులు కూడా వచ్చాయి. చీడపీడలు ఆశించిన మిర్చి తోటల్లో తక్కువ దిగుబడులు వచ్చాయి. క్వింటా ధర మార్కెట్‌లో రూ.22 వేల వరకూ పలుకుతోంది. ఎక్కువ మోతాదులో రసాయన ఎరువులు వాడకుండా ఉంటే మంచి దిగుబడులు వస్తాయి.

– కె.విజయకుమార్, మండల వ్యవసాయ అధికారి, కంచికచర్ల

త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలి



నందిగామ: సచివాలయ ఉద్యోగులు ప్రజల సమస్యల పరిష్కారం విషయంలో చురుగ్గా వ్యవహరించాలని మునిసిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం సూచించారు. పట్టణంలోని 6వ సచివాలయాన్ని ఆయన బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. సచివాలయానికి వచ్చిన వారిని అడిగి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సచివాలయంలోని రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, సచివాలయ ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేయాలని, అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని, సమయ పాలన పాటించాలని ఆదేశించారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు



వేసవి శిక్షణ శిబిరానికి హాజరైన విద్యార్థులు



తెలుగు వ్యాకరణంలో శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు



వత్సవాయిలో దినపత్రికలతోపాటు నీతికథల పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉన్న జిల్లా గ్రేడ్–1 శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. బుధవారం ఆసక్తి కలిగించే కథలను పిల్లలు చదువుకుని, వాటి సారాంశాన్ని, నీతిని తమకు ఎలా అర్థమయిందో తెలిపే పుస్తక సమీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయుడు డి.నాగేశ్వరరావు వ్యాకరణంలో శిక్షణ ఇచ్చారు. ఆడపిల్లలకు అల్లికలకు సంబంధించిన విషయాలను బీడీసీ నాగమల్లిక నేర్పించారు. గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, గ్రంథాలయ సిబ్బంది శ్యామల, సత్యావతి పాల్గొన్నారు.

వేసవి శిబిరాలతో విజ్ఞానం

పెనుగంచిప్రోలు: వేసవి శిక్షణా శిబిరాల వల్ల విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుందని గ్రంథాలయాధికారి మధుబాబు అన్నారు. వేసవి శిబిరంలో భాగంగా బుధవారం పెనుగంచిప్రోలు శాఖాగ్రంథాలయంలో విద్యార్థులకు కథలు చెప్పించడం, పుస్తకాలు చదివించటంతో పాటు కార్టూన్లు గీయించటంలో శిక్షణ ఇచ్చారు.

చిన్నారులకు కథలపై శిక్షణ

వత్సవాయి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మండలకేంద్రం వత్సవాయిలోని గ్రేడ్–3 గ్రంథాలయంలో చిన్నారులకు బుధవారం పొడుపు కథలు, నీతి కథలను విద్యార్థులకు చదివి వినిపించారు. పిల్లలతో కూడా కథలు చదివించారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 వరకు గ్రంథాలయంలో శిబిరం కొనసాగింది. ఆటల పోటీలలో గెలుపొందినవారికి బహుమతులను అందిస్తున్నారు. గ్రంథాలయ విశిష్టత గురించి అధికారి ఎ. ప్రభాకరరావు వివరించారు.

ఉల్లాసంగా వేసవి విజ్ఞాన శిబిరం

కంచికచర్ల(వీరులపాడు): స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉల్లాసంగా కొనసాగుతోంది. విద్యార్థులతో బుధవారం దేశభక్తి గేయాలు పాడించారు. ముందుగా ప్రపంచ టెలికమ్యూనికేషన్ దినోత్సవ ప్రాధాన్యతను జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఇస్మాయిల్ వివరించారు. అనంతరం విద్యార్థులకు చదవడం, పొడుపు కథలు, సామెతలు, పాటలు, డ్యాన్స్, డ్రాయింగ్, యోగా, బ్యాడ్మింటన్, చదరంగం, టెన్నికాయిట్, స్కిప్పింగ్ తదితర ఆటలు ఆడించారు. గ్రంథాలయ అధికారి రామచంద్రుడు, సర్వేశ్వరరావు, నారాయణ, రంగిశెట్టి వెంకటేశ్వర్లు, పేరయ్య, శ్రీను, బాలకోటయ్య, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగన్ హయాంలో రాష్ట్రంలో సుపరిపాలన

గడప గడపకు మన ప్రభుత్వంలో నందిగామ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



దొడ్డదేవరపాడులో గడప గడపలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

దొడ్డదేవరపాడు(వీరులపాడు): ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో సుపరిపాలన అమలవుతోందని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని దొడ్డదేవరపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి గడపకూ ఎమ్మెల్యే వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించటంతో పాటు ప్రజా సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి విశ్వసనీయ, పారదర్శక పాలన అందించటంతో పాటు నిరుపేదల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. గత ప్రభుత్వాల మాదిరిగా ఏ ఒక్క వర్గానికో కొమ్ముకాయకుండా, అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రజలందరి సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉంటే పాలన ఎలా ఉంటుందో రాష్ట్ర ప్రజలు చూస్తున్నారని వివరించారు.

మంచి మనిషికి మద్దతు పలకాలి

ప్రజలకు నిరంతరం మంచి చేయాలనే తపనతో పని చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో అండగా నిలిచి పూర్తి మద్దతు పలకాలని గ్రామస్తులను ఎమ్మెల్యే జగన్‌మోహనరావు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ చెంద్యాల రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు తోట నారాయణరావు, గ్రామ నాయకులు వెంకటేశ్వరరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు బస్సు నడపాలని వినతి



బస్సు సర్వీసుపై ఆర్టీసీ డిపో మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ ఉదయభాను

వత్సవాయి: మండలంలోని కంభంపాడు నుంచి విజయవాడ వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలని జగ్గయ్యపేట ఆర్టీ డిపో మేనేజర్ ఎం.వి. ప్రసాద్‌కు ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సూచించారు. గ్రామం నుంచి పలు పనుల నిమిత్తం విజయవాడ వెళ్లాలంటే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామం నుంచి పెనుగంచిప్రోలు లేదా చిల్లకల్లు వెళ్లి అక్కడ నుంచి విజయవాడ వెళ్లాల్సి వస్తోంది. సొసైటీ అధ్యక్షులు వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు జంగాల కల్యాణి విషయాన్ని బుధవారం ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే స్పందించిన ఆయన డిపో మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. బోనకల్ నుంచి విజయవాడ వెళ్తున్న ఆర్టీసీ బస్సును వత్సవాయి నుంచి వేమవరం, కంభంపాడు, పెనుగంచిప్రోలు మీదుగా విజయవాడ వెళ్లేలా చూడాలని కోరారు. డీఎం సానుకూలంగా స్పందించి వెంటనే బస్సు సర్వీసు నడుపుతామని హామీఇచ్చారు. సమస్య తెలిపిన వెంటనే స్పందించి పరిష్కారాన్ని చూపిన ఎమ్మెల్యే ఉదయభానుకు గ్రామస్తుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలకు రూ.87 లక్షల రుణాల మంజూరు

నందిగామ: రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం కృషి చేస్తోందని కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ అన్నారు. మండలంలోని మాగల్లు గ్రామానికి చెందిన ఏడు డ్వాక్రా గ్రూపుల్లోని 70 మంది మహిళలకు మంజూరైన రూ.87 లక్షల రుణాల చెక్కులను బుధవారం సాయంత్రం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఎన్నో రూపాల్లో ఆర్థిక సహాయం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాలకేంద్రం అధ్యక్షుడు తాళ్లూరు శ్రీను, పీఏసీఎస్ కార్యదర్శి పూర్ణ చంద్రరావు పాల్గొన్నారు.

చలివేంద్రంలో పుచ్చముక్కల పంపిణీ



జగ్గయ్యపేట అర్బన్: పట్టణ పద్మశాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బాటసారుల దాహార్తి తీర్చేందుకు స్థానిక పాత మునిసిపల్ కార్యాలయం కూడలిలో ఏర్పాటుచేసిన ఆయుర్వేద మజ్జిగ పంపిణీ కేంద్రంలో బుధవారం పుచ్చ ముక్కలు పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు పెనుమల్లి చంద్రమౌళి మాట్లాడుతూ సంఘ సభ్యులు మునిని శివ సహకారంతో సుమారు మూడు వేల మందికి పుచ్చ ముక్కలు పంపిణీ చేశామని తెలిపారు. తొలకరి వర్షాలు పడి వాతావరణంలో మార్పు వచ్చేంత వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

ఆయాలు సేవాభావంతో పనిచేయాలి



అంగన్‌వాడీ ఆయాలకు నియామకపత్రాలు అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న ఆయాలు సేవాభావంతో విధులు నిర్వర్తించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సూచించారు. తద్వారా చిన్నారుల తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల ఆదరాభిమానాలను పొందాలన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలోని పోచంపల్లి, సింగవరం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్తగా నియమితులైన ఆయాలు బుధవారం ఎమ్మెల్యే ఉదయభానును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సింగవరం అంగన్‌వాడీ కేంద్రానికి ఆయాగా జల్లే రాణి, పోచంపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు ఆయాలుగా ఇరుగు రత్నకుమారి, బూతుకూరి భారతికి ఉదయభాను నియామక పత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీభార్గవి, సూపర్‌వైజర్లు బి.బి.జాన్, సువర్ణ, ఏఎంసీ మాజీ డైరెక్టర్ ఇరుగు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



గౌరవరం వద్ద ప్రమాదాలు జరిగే ప్రాంతాలను పరిశీలిస్తున్న సీఐ

జగ్గయ్యపేట: మండలంలోని 65వ నంబరు జాతీయ రహదారిపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని సీఐ జానకిరామ్ పేర్కొన్నారు. మండలంలోని జాతీయ రహదారిపై ఉన్న అనుమంచిపల్లి, బలుసుపాడు, గౌరవరం, నవాబుపేట, షేర్‌మహ్మద్‌పేట గ్రామాల్లోని క్రాసింగ్‌లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా గ్రామాల నుంచి జాతీయ రహదారులకు క్రాసింగ్ వెళ్లే సమయంలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. ముఖ్యంగా గౌరవరం, షేర్‌మహ్మద్‌పేట అడ్డరోడ్డు, అనుమంచిపల్లి వద్ద స్టాప్ బోర్డులతో పాటు జీఎంఆర్ టోల్‌ప్లాజా సహకారంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రాత్రి వేళ మొబైల్ టీంలను అప్రమత్తం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ దుర్గాప్రసాద్, టోల్‌ప్లాజా ప్రతినిధి నాగకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ బలోపేతానికి కృషి



అసోసియేషన్ సభ్యులతో నాయకులు

మైలవరం: వేసవిలో ఎలక్ట్రికల్ వర్కర్స్ అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీహరిరావు పేర్కొన్నారు. ఏపీ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ సమగ్ర సర్వేలో భాగంగా బుధవారం మైలవరం మండల ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ కమిటీతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమైక్యంగా వర్కర్స్ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. అసోసియేషన్ మైలవరం మండల అధ్యక్షుడు కె.పెదబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్, ఎం.వి.ఎస్. బ్రహ్మం, సలీమ్, నాగేశ్వరరావు, శ్రీకాంత్, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు డి.సత్యనారాయణ, జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రవికుమార్, ప్రచార కమిటీ సభ్యుడు నారాయణరావు పాల్గొన్నారు.

ఉదయభానుకు ఏపీ జేఏసీ ఉద్యోగుల వినతి

జగ్గయ్యపేట అర్బన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానును ఏపీ జేఏసీ బాధ్యులు బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులకు పీఆర్సీ అరియర్స్, పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలను విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌లోకి మార్చాలని కోరారు. ఏపీ జేఏసీ జిల్లా అసోసియేట్ చైర్మన్ డి.శ్రీనివాస్, ట్రెజరర్ తిరుమల శివయ్య, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బత్తిన రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ ఎస్.వి.రవీంద్రనాథ్, ఏపీ పీటీడీ జగ్గయ్యపేట డిపో కార్యదర్శి ఆనంద్, పేట పంచాయతీరాజ్ విభాగం అసోసియేషన్ నాయకుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు



స్వామి వారి మూలవిరాట్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లో వేం చేసి ఉన్న శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థాన ద్వాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు జూన్ 4 నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ, ఆలయ అర్చకులు వినుకొండ రామరత్నమాచార్యులు, మురికిపూడి మణిదీప్‌కుమార్ బుధవారం తెలిపారు. ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో స్వామి వారికి విశేష అభిషేకాలు, అర్చనలు, కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. శోభకృత నామ సంవత్సర జ్యేష్ఠ పూర్ణిమ (నాలుగో తేదీ) ఉదయం సహస్ర కలశ యాత్ర నిర్వహిస్తామని చెప్పారు. భక్తులు ఊరేగింపుగా దుర్గా ఘాట్‌కు చేరుకుని కలశాలతో నదీ జలాలను తీసుకుని తిరిగి ఆలయానికి చేరుకుంటారన్నారు. స్వామి వారికి అభిషేకాలు, అనంతరం పెండ్లి కుమారునిగా అలంకరిస్తామన్నారు. ఐదో తేదీ ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం , అగ్నిమథనం, అగ్ని ప్రతిష్ట, గరుడ ఆరాధన, సాయంత్రం నిత్య హోమం, అష్టాక్షరీ హోమం, ధ్వజారోహణ, నవ కుంభారాధనలు జరుగుతాయని చెప్పారు. ఆరో తేదీ ఉదయం నిత్య హోమం, పంచసూక్త హోమం, సామూహిక కుంకుమార్చనలు, సాయంత్రం నిత్యం హోమం , ఎదుర్కోళ్ల ఉత్సవం, రాత్రికి శ్రీ వారి కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. ఏడో తేదీ నిత్య హోమం, బలిహరణ, వసంతోత్సవం, చక్ర స్నానం అనంతరం పూర్ణాహుతితో ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు. సాయంత్రం స్వామి వారి నగరోత్సవం జరుగుతుంది. ఎనిమిదో తేదీ శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామి వారి మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు, అనంతరం స్వామి వారికి పుష్పయాగం జరుగుతుందన్నారు. అదే రోజు ద్వాదశ ప్రదక్షిణలు, అనంతరం పవళింపు సేవతో ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు.

నిబంధనలు పాటించకుంటే జరిమానాలు



నందిగామ: వాహన చోదకులు నిబంధనలు పాటించకపోతే జరిమానాలు తప్పవని ఎస్ఐ సోమేశ్వరరావు హెచ్చరించారు. పట్టణంలోని గాంధీ సెంటర్‌లో బుధవారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించారు. నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న వాహనాలు, లైసెన్సు లేకుండా వాహనాలు తోలుతున్న వారికి, త్రిపుల్ రైడింగ్, వాహనాలు తోలుతున్న మైనర్లకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు పలువురికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. వాహనచోదకులు నంబర్ ప్లేట్లు లేకుండా వాహనం నడిపితే కచ్చితంగా స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానులపై కేసు నమోదు చేస్తామని స్పష్టంచేశారు.